# ఓంకార పురి చరిత

‘ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?’ అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అలాగని చరిత్రని ఉపేక్షిస్తే, ఏ జాతికీ చరిత్ర ఉండదు. చరిత్ర ఎంత ఆకర్షణీయమంటే – తన చరిత్రకోసం అన్వేషించని జాతి ఉండదు. ఆ చరిత్ర ‘ఏమున్నది గర్వకారణం?’ అనిపించేలా ఉండకూడదని హెచ్చరించడం శ్రీశ్రీ భావం.

శ్రీ విజయకుమార్ రెడ్డి మెదక్ జిల్లాలోని కోహీర్ పురంలో (ఒకప్పటి ఓంకారపురం) పుట్టారు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయనకు వ్యవసాయమంతగానూ ఇష్టమైనది పుస్తకపఠనం. పరిసరాల్ని కూడా పుస్తకంలా పఠించే ఆయనకు, ‘చూడ ముచ్చట గొల్పు నాటి శిలాసంపద, అచ్చోట ఇచ్చోట ఎచ్చోట గాంచిన, మట్టి గోడలలోను ఆరు బైళ్లలోను, దారిలోను పంట పొలాలలోను కాంచనగును’. వాటిలో గర్వకారణం అనిపించేవి ఎన్నో కనిపించాయి. గర్వకారణం కాని గుణపాఠాలూ వినిపించాయి. ఆ విశేషాలన్నీ చరిత్రగా భావితరాలకు చేరాల్సినంత గొప్పవి. ఆ చరిత్ర వాస్తవాలకు అద్దం పట్టాలి, వినడానికి రసవత్తరంగా ఉండాలని సంకల్పించారాయన. అప్పుడప్పుడు కవితలల్లే హాబీకి, ఉపాధ్యాయుడిగా 38 ఏళ్ల అనుభవం జతపడగా, ఆయన కలంనుంచి ‘ఓంకార పురి చరిత’ జాలువారింది. చరిత అంటే కవితలా వినిపించిన చరిత్ర.

‘కవిత్వమొక తీరని దాహం’ అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఎంత చెప్పినా కవికీ, ఎంత చదివినా పాఠకునికీ తీరని దాహమది. శ్రీశ్రీ చెప్పిన భాష్యానికి సాటివచ్చేలా రూపొందిన ఈ చరిత – వచన కవిత, నాటిక, బుర్రకథ వగైరా వివిధ సాహితీ ప్రక్రియల సమ్మేళనం. ప్రాచీన సంప్రదాయం స్ఫురించేలా, ‘శ్రీలొలుకు సిరులొలుకు చిరునవ్వులొలుకు’ అంటూ శ్రీకారంతో మొదలైన ఈ చరిత ఛందోబద్ధం కాదు. కానీ ఆద్యంతం నృత్యనాటికకు అనువైనంతగా లయబద్ధం.

హరిహరబ్రహ్మల సమైక్య రూపంగా వెలసిన ఓంకారేశ్వర లింగోద్భవం ఈ కథారంభం. ఆ తర్వాత ప్రతాపరుద్రుని వైభవం, రుద్రమదేవి ప్రతాపం, ఎక్కలదేవి ఆవిర్భావం, ఓరుగల్లు పతనం వగైరా అనేక విశేషాలకు పౌరాణిక, చారిత్రక, సాంఘిక పరంగా నవరస భరితమైన వివరణ. అన్నీ ఓంకారపురంతో ముడిపడి ఉండడం సందర్భోచితం. అన్ని మతాలూ, అందరు దేవుళ్లూ ఒక్కటేనన్న సందేశం ఈ చరితకు ముగింపు.

ఆరంభంలో కవికి తన ఊరిపై ఉన్న ఎక్కువ మక్కువకు నిదర్శనంగా, ‘సకల సద్గుణ

సంపన్నులార కోహీరు పౌరులార' అన్న మకుటం మనోహరంగా ఉంది. కానీ ఆ తర్వాత రస, సరస, సహృదయులుగా కోహీరువాసుల ప్రస్తావన అక్కడక్కడ మాత్రమే ఉంది. సకల జనులనూ ఉద్దేశించిన ఈ చరిత, కోహీరువాసులకు మాత్రమే పరిమితం కాదు మరి!

కవి చారిత్రక, భౌగోళిక, సాంఘిక పరిజ్ఞానం ఎన్నదగినది. కథ చెబుతూ ఆయన భేతిరెడ్డి, నామిరెడ్డి, కామిరెడ్డి, సోమిరెడ్డి, మేచనాయుడు, శివదేవయ్య మంత్రి, బెండపూడి అన్నయ్య, సోమనాయకుడు వగైరా ఎన్నో చారిత్రక నామాలు ప్రస్తావించారు. వివిధ పురాలకి ఆ పేర్లెలా వచ్చినదీ వివరిస్తూ – 'గణపతేంద్రుని పేర వెలసె గణపపురము, బిలాల్‌ఖాను పేర బిలాల్‌పురము, భిల్లుల తెగ నివాసము భిల్లిపురము, కవేలి కాకతమ్మ పసిడి పంటల పైడిగుమ్మల, తాంత్రిక బాపని పేర నలరారె బాపనిపల్లె' అన్నారు. నాటి పురవీధుల విభజనను స్పష్టం చేస్తూ – 'తూర్పు దక్షిణాన బ్రాహ్మణవీధి, కాపువాడ, వీరశైవులు, విశ్వకర్మలు, ముదిరాజులు, మేతర్‌వాడ, గొల్లవీధి, వడ్రంగులు, తలారులు, వీరముష్టివారు బైండ్లవారు చిన్న చితక పనులవారు దినసరి కూలీలు' అన్నారు.

సన్నివేశాల్ని కళ్లకు కట్టించడం కవులకు సామాన్యమే. కానీ అవి కొన్ని వందల ఏళ్ల క్రితానివైతే? ఉదాహరణకి ఈ రచనలో ఓ పేద అవ్వ రాజుకి ఆతిథ్యమిచ్చిన సన్నివేశం గమనిద్దాం. ఆమెది 'చిన్న పెంకుటిల్లు ద్వారానికి మామిడి తోరణం, ఇంటి వెలుపల అరుగులు, ఆవరించిన చెట్టు నీడ, లోపల ఎదురుగ పడసాల, దిగుడులో శివ శివాణి పటం, వాకిట్లో మల్లెలు మందారాలు పూజా ప్రసూనాలు, పిండి నోట కరచిన గండు చీమల బారు, తల్లి పాలు గుడుచుచున్న పిల్లి కూనలు, చిరుకొయ్యపై పిచ్చుకలు రెండు అప్పుడప్పుడు, నేల వ్రాలుతు అన్నం మెతుకుల ఆరగింపు'. ఆ తర్వాత అవ్వ వడ్డన వివరాలు :

చెక్కపీట ముందర విస్తరి, అటికలో వండిన కొర్రబువ్వ<br>
మట్టిపెంకపై కాల్చిన జొన్నరొట్టె, రాచిప్పలో వెల్లుల్లి రోకలి కారం<br>
వొరుగు శెనిగె కూర, అవిశె పొడి,<br>
చిన్నబుడ్డిలో ఘుమఘుమ వాసన నెయ్యి<br>
గురిగిలో మీగడ పెరుగు, దొన్నెలో వడగండ్ల పాయసం<br>
దాలిగుంతలో కాచిన ఆవుపాల జాంబి, మక్కిన అరటిపండ్లు!

నిజమే ఇజంగా, సమ్మతమే మతంగా రూపొందిన చరిత ఇది. అందుకే ఒకచోట 'కవ్వమాడిన

ఇంట సిరుల పంట, కదురాడిన చోట కలికి కులుకునంట, గోవు అడుగులవెంట లచ్చి అడుగిడునంట, గోవు వెలసిన ఇంట గోవిందుడుండునంట!' అని సంప్రదాయాన్ని మెరిపిస్తారు. ఒకచోట 'తరతరాలుగా వస్తున్న కరడు వ్యవస్థ, ఎన్నడు పోతుందో ఈ కుళ్లు సంస్థ, కలసి తింటున్నాము మనము కాని, కలసి ఉండలేకపోతున్నాము!' అని సంప్రదాయంలో కులతత్వాన్ని నిరసిస్తారు. ఒకచోట 'నారి లేని నాడు నరుడు లేడు, నరుడు లేని నాడు నవత లేదు, నవత లేక నాగరికత లేదు, నాగరికత లేక జగతి ప్రగతి లేదు' అని ప్రగతినీ, ఒకచోట 'కాంత కాంచనములు ఎంతో కమ్మనైన కలిగించు ముప్పు' అని పతనాన్నీ, మహిళలకు ఆపాదించగలరు. ఒకచోట, మగవాని మనసు చెదరగొట్టిన కామినుల ప్రస్తావనలో – మేనక, అహల్యలతోపాటు క్లియోపాత్ర కూడా చేరడం, ఈ చరితను గ్లోబలైజ్ కూడా చేసిందనవచ్చు. ఇక 'కాలము మూడి కర్మగాలిన, లచ్చి మొగుడు బిచ్చమెత్తు' వంటి దేశీయ లోకోక్తులకు కొదవే లేదు.

నేడు ధనార్జనకున్న ప్రాధాన్యం కులవృత్తులకు లేదు. కానీ కులవృత్తులు పాటించని వారు కూడా కులంపట్ల దురభిమానాన్ని ప్రకటిస్తున్నారు. అందుకు భిన్నంగా ఈ చరితలో ఓ చేనేత కార్మికుడు, 'శ్రమయే దైవం, మగ్గమే దేవాలయం' అంటాడు. 'సిరి కోరనివాడు శ్రీమంతుడు, సిరి రాదు మన వెంట చివర, మంచి చెడులు మన చిరునామ' అని ధనికస్వామ్యాన్ని నిరసిస్తాడు. ఆధునికులీ సందేశాన్ని ఆచరణీయమైన మేరకు గ్రహించాలి.

చమత్కారంలో 'చంద్రముఖిని జూచి చంద్రశేఖరుని మరిచె' వంటి వ్యాఖ్యలు అలరిస్తాయి. 'అటు దొర్లె రతిరాజు, ఇటు దొర్లె క్షితిరాజు, వెన్నెలై దూరె రేరాజు, మెత్తటి పాన్పు కంటకి, నిదుర రాదాయె కంటికి!' అన్నది ఒకచో విరహ వర్ణన. పద ప్రయోగంలో నవ్యత, అంత్యప్రాస గమనార్హం.

తెలుగునాట కవితా ప్రక్రియలు చాలా ఉన్నా, అన్నింటిపట్లా సుహృద్భావమున్న అరుదైన వారిలో ఈ కవి ఒకరు. ఈ చరితలో కొన్నిచోట్ల, ఆయా ప్రక్రియల్లో సుప్రసిద్ధుల ప్రభావం కనబడుతుంది. మచ్చుకి :

'కాంచెనట రాజేంద్రుడు కోకిల కుహకుహ శీతల సమీరం' (అల్లసాని పెద్దన మనుచరిత్ర ప్రబంధంలో 'అట జని కాంచె భూమిసురు డంబర చుంబి పటదముహుర్లుహుల్)

'బాలనురా మదనా నే బేలనురా మదనా' (మిస్సమ్మ చిత్రంలో పింగళి వారి జావళి 'బాలనురా మదనా')

'మనసంత నీవుండ తనువెల్ల పులకింత' (అమరశిల్పి జక్కన్న చిత్రంలో సినారె జావళి 'ఎదుట కన్నుల పంట ఎదలో తియ్యని మంట)

'నల్లనివాడు బక్కపలుచనివాడు దుమ్ముబారిన కుచ్చు తలపాగవాడు చాలిచాలని దుస్తులు దాల్చినవాడు కాంచెనచట కంబళి నేతవాణ్ణి' (బమ్మెర పోతన భాగవతంలో 'నల్లనివాడు పద్మ నయనమ్ములవాడు')!

ఐతే ఇవి కేవలం అనుసరణలు. కానప్పుడు మూలం వివరాలు పొందపర్చడం జరిగింది. ఉదాహరణకి ఒకచోట, 'అర్ధాంగనారియై నున్న రుద్రుడు సర్వాంగనారియై కాకతి రుద్రమ్మగా అవతరించె' అన్న చమత్కార వ్యాఖ్య అద్భుతం. దానికి మూల భావం విద్యానాథుని సంస్కృత రచన 'ప్రతాప రుద్రీయం'లో ఉన్నట్లు కవి పేర్కొనడం జరిగింది. ఐతే ఆ భావసౌందర్యానికి విజయకుమార్ తెనుగు సేతలో పూర్తి న్యాయం జరిగిందనడం నిర్వివాదాంశం.

ఈ 'ఓంకార పురి చరిత' ఊహాజనిత కవిత కాదు. ఇందులోని ప్రతి అంశానికీ విన్నవో, చూసినవో, చదివినవో ప్రమాణాలున్నాయి. అన్నింటినీ ఫుట్‌నోట్స్‌గానో, ఫొటోల రూపంలోనో పాఠకుల ముందుంచారు కవి. ఐతే ఈ చరిత చదివేముందు, ఆయన పరిచయ వాక్యాల్లో కవి హృదయం తెలుసుకోవడం, ఈ చరిత అవగాహనకు మరింత దోహదం చేస్తుంది.

ఒకప్పుడు ముస్లిములు హిందూ దేవాలయాల్ని అల్లా ఆలయాలుగా మార్చుకున్నారు. దానికి కవి స్పందన చూడండి : 'దేవి ఎక్కల పూజలందిన చోట, మారూఫ్ హుస్సేన్ ఫాతేహా పొందు, స్థల పవిత్రత చెరగలేదు, తీరు మారిన లక్ష్యం చెదరలేదు, మనిషి ధ్యేయమొక్కటె గేహమొక్కటె, మార్గాలు వేరు మోక్షం గమ్యమొక్కటె'. ఈ సందేశంతో ఈ చరిత ముగుస్తుంది.

నేటి హిందూ ముస్లిముల సహజీవనానికి దారి తీసిన స్ఫూర్తి ఇదే! కులం, మతం, ప్రాంతం వగైరాల విషయంలో అదే స్ఫూర్తిని అడుగడుగునా ప్రదర్శించిన ఓ తెలంగాణ పురి 'ఓంకార పురి' చరిత ఇది. అపురూపమైన ఆ గడ్డపై జనించిన తెలుగుబిడ్డ విజయకుమార్ రెడ్డి ఆశయ స్ఫూర్తికి ప్రతిబింబమైన చరిత ఇది. ఆ స్ఫూర్తికి అభినందనలు!

హైదరాబాద్ – **వసుంధర**

సెప్టెంబర్ 19, 2012